

నరసరావుపేటలో ఈవీఎంలు తీసుకువెళుతున్న పోలింగ్ సిబ్బంది

సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ సోమవారం జరగనుంది. వివిధ ప్రాంతాల నుంచి ఓటర్లు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఓటేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ల ద్వారా, 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు హోం ఓటింగ్‌లో ఓటేశారు. మిగిలిన సాధారణ ఓటర్లు సోమవారం ఈవీఎం యంత్రాలలో మీట నొక్కి వారి తీర్పుని ఇవ్వనున్నారు. షెడ్యూల్, నోటిఫికేషన్, నామినేషన్లు, ప్రచారం ఇలా ఒక్కో అంకం దాటుకుంటూ వచ్చిన ఎన్నికల సమరం తుది ఘట్టమైన సోమవారం పోలింగ్ డేకి అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది.



ఓటేద్దాం..

నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ప్రశాంత ఓటింగ్‌కు పటిష్ఠమైన ఏర్పాట్లు
- సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్.. సీసీ కెమెరాలు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- సెక్టార్ల వారీగా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో తరలిన సిబ్బంది





పోలింగ్ సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి



నరసరావుపేట కేంద్రంలో పోలింగ్ మెటీరియల్‌ను పరిశీలించుకుంటున్న ఎన్నికల సిబ్బంది



నరసరావుపేటలో కేంద్ర బలగాల ఫ్లాగ్ మార్చ్

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ విధులకు కేటాయించిన సిబ్బంది అంతా పంపిణీ కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రిని తీసుకుని ఆదివారం మధ్యాహ్నం నుంచి తమతమ పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. ప్రతి కేంద్రంలో 120 శాతం సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఎక్కడ ఎటువంటి అవసరం వచ్చిన అందుబాటులో ఉండేలా రిజర్వ్ సిబ్బందిని కూడా నియమించారు. ఎక్కడైనా ఈవీఎంలు పనిచేయకపోతే వాటి స్థానంలో ఏర్పాటు కు 20 శాతం అదనంగా సిద్ధం చేశారు. ఓటింగ్ ప్రక్రియ మొత్తం ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి పూర్తి పారదర్శకంగా జరగాలని ఎన్నికల అధికారులు ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ బూత్‌ల వెలుపల జనం గూమికూడకుండా ఉండేందుకు ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్‌ని అమలు చేయనున్నారు. రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్‌కు 200 మీటర్ల వెలుపలే ఉండి పరిశీలించుకోవాలి. పోలింగ్ కేంద్రాలను పరిశీలించడానికి అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంది. అభ్యర్థులు తిరగడానికి మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చా రు. ఒక వాహనంలో డ్రైవర్‌తో కలిపి ఐదుగురికి మాత్రమే ఎన్నికల కమిషన్ అనుమతి చ్చింది. జిల్లా కేంద్రంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద జరిగే సంఘటనలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఏదైనా సంఘటన జరిగితే దగ్గరలో ఉన్న అధికారులకు తెలిపి వెంటనే తగు చర్యలు తీసుకునేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితులను చక్కబరచడానికి క్విక్ రెస్పాన్స్ టీం, రాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశారు.

స్లిప్పులు లేకపోయినా ఓటు..

ఓటరు తన పోలింగ్ బూత్, సీరియల్ నెంబరు తెలుసుకుని ఏదైనా గుర్తింపు కార్డుతో కేంద్రానికి వెళితే ఓటు వేయడానికి అనుమతిస్తారు. స్లిప్పులు పొందలేకపోయిన వారు ఓటరు ఐడీ కార్డు తీసుకుని బూత్ వద్దకు వెళితే అక్కడి సిబ్బంది చూసి ఓటర్ స్లిప్పుని అప్పటికప్పుడు ప్రింట్ తీసి ఇస్తారు. ఓటరు కార్డుకు ప్రత్యామ్నాయంగా 12 రకాల గుర్తింపుకార్డులు తీసుకువెళ్లడానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చింది. వీటిలో ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, పాస్‌బుక్, ఆరోగ్యబీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాస్‌పోర్టు, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్ తదితర కార్డులను ఓటు హక్కు వినియోగం కోసం గుర్తింపు కార్డుగా అనుమతిస్తామన్నారు సాయంత్రం ఆరు గంటల లోపు పోలింగ్ కేంద్రం ఆవరణలోకి ఎవరైతే ప్రవేశిస్తారో వారికి మాత్రమే టోకెన్ నెంబర్లు ఇచ్చి ఎంత సమయమైనా ఓటు వే య ం డా ని కి



గణపవరంలో పోలింగ్ సామగ్రితో తరలి వెళ్తున్న సిబ్బంది



చిలకలూరిపేట: ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూలులో పోలింగ్ బూత్ ల వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు, బారికేడ్లు

అవకాశం కల్పిస్తారు. సెల్‌ఫోన్లను పోలింగ్ కేంద్రాల ఆవరణలో నిషేధించారు. పోలింగ్ బూత్‌లు లోకేషన్‌కు ఒక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం, బారికేడింగ్, క్యూలైన్‌లు, వీటిపై షామియానాలను ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం వీల్‌చైర్లను పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేశారు.

పటిష్ఠ నిఘా.. పలువురు బైండోవర్

మున్సిపాల్టీలు, గ్రామాల్లో ప్రశాంత ఎన్నికలకు ముందస్తు చర్యల్లో భాగంగా వేలాది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. సమస్యాత్మక కేంద్రాల్లో పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని సమస్యాత్మక పోలింగ్ బూత్‌లలో బందోబస్తుకు నియమించారు. శాంతియుత వాతావరణంలో ఓటింగ్ ప్రక్రియ సాగడానికి పెద్దసంఖ్యలో పోలీసు బలగాలను మొహరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో పాటు ప్రతి చోట పటిష్ఠ నిఘా పెట్టి పోలింగ్ ప్రక్రియను పోలీసులు పర్యవేక్షించనున్నారు. లోపల వెబ్‌కాస్టింగ్ ఉంటే బయట సీసీ కెమెరాలతో కదలికలను పోలీసులు గమనించనున్నారు. నేరచరిత్ర ఉన్నవారిని ఇప్పటికే బైండోవర్ చేసిన పోలీసు శాఖ హద్దుదాటితే కఠిన చర్యలు తప్పవనే హెచ్చరికలు జారీ చేసింది. రాజకీయ పార్టీల అనుచరులు సైతం రెచ్చగొట్టేలా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, ప్రజలంతా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా చూడడమే తమ ధ్యేయమని పోలీసు శాఖ చెబుతోంది.

మొత్తం ఓటర్లు 17,20,526

పల్నాడు జిల్లాలో 17,20,526 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. 8,39,967 పురు షులు, 8,80,370 మంది మహిళలు, ఇతరులు 189 మంది ఓటర్లుగా ఉన్నారు. జిల్లా అంతటా 1026 ప్రాంతాల్లో 1,929 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 1297 పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ చేస్తున్నారు. వీడియో నిఘా కూడా ఏర్పాటు చేశారు. ముం దస్తు చర్యల్లో భాగంగా 10,800 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. 466 మంది అబ్జర్వలను నియమించారు. సమస్యాత్మక ప్రదేశాల్లో 800 సీసీ కెమెరాల ఏర్పాటు చేశారు. పోలింగ్ ఏర్పాట్లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ ఆదివారం పర్యవేక్షించారు. మాచర్ల, పెదకూరపాడు, గురజాల, వినుకొండ అసెంబ్లీ నియోజకవర్గాలను సమస్యాత్మకమైనవిగా ఎన్నికల కమిషన్ గుర్తించింది. ఈ నియోజకవర్గలోని 1,168, నరసరావుపేట పరిధిలోని 70, చిలకలూరిపేటలోని 32, సత్తెన పల్లి నియోజకవర్గంలోని 27 పోలింగ్ బూత్‌లను సమస్యాత్మకమైనవిగా గుర్తించి ప్రశాంత ఓటింగ్‌కు అధికారులు పటిష్ఠమైన ఏర్పాట్లు చేశారు. ఈ బూత్‌లకు మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేశారు. పెదకూరపాడులో 53, చిలకలూరిపేటలో 39, నరసరావుపేటలో 84, సత్తెనపల్లిలో 26, వినుకొండలో 95, గురజాలలో 92, మాచర్ల నియోజకవర్గంలో 77 మంది మైక్రోఅబ్జర్వర్ల నియమించారు. పెదకూరపాడు నియోజకవర్గాన్ని 27 రూట్లుగా, చిలకలూరిపేట 25, నరసరావుపేట 21, సత్తెనపల్లి 21, వినుకొండ 27, గురజాల 27, మాచర్ల 28 రూట్లుగా విభజించారు. పీవో, ఏపీవో, ఓపీవోలుగా 13,035 మందిని నియమించారు. సెక్టార్ అధికారులుగా 187 మంది విధులు నిర్వహించనున్నారు.

పోలింగ్‌కు నాలుగంచెల భద్రత

పల్నాడు జిల్లాలో ప్రశాంత పోలింగ్‌కు పోలీసు శాఖ నాలుగంచెల భద్రతను ఏర్పాటు చేసింది. సుమారు 6,000 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. 20 కంపెనీల కేంద్ర భద్రతా బలగాలను రప్పించారు. పోలింగ్ కేంద్రాల వద్ద స్టాటిక్ ఫోర్స్ ఎస్ఐ స్థాయి అధికారితో రూట్ మొబైల్ పార్టీ, సీఐ స్థాయి అధికారితో మండల పరిధిలో స్ట్రైకింగ్ ఫోర్స్, డీఎస్పీ స్థాయి అధికారితో నియోజకవర్గ స్థాయిలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌గా నాలుగంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. వీరి పర్యవేక్షణకు ప్రతి నియోజకవర్గానికి అదనపు ఎస్పీ స్థాయి అధికారి అదనపు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌తో సిద్ధంగా ఉంచారు. 558 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించి ఆయా కేంద్రాలకు ప్రత్యేకంగా కేంద్ర పారా మిలిటరీ బలగాలను బందోబస్తుకు నియమించారు. మాచర్ల నియోజకవర్గానికి ఎస్పీ స్థాయి అధికారిని, ఇతర నియోజకవర్గాలకు అదనపు ఎస్పీ స్థాయి అధికారులను ఇన్ చార్జిలుగా నియమించారు. ఎస్పీ బిందు మాధవ్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్క ఓటరు ప్రశాంత వాతావరణంలో వారి ఓటు హక్కు వినియోగించుకోవాలని బిందు మాధవ్ కోరారు. ఎవరైనా అవాంఛ నీయ సంఘటనలకు చట్ట వ్యతిరేక మైన కార్య కలాపాలకు పాల్పడ డానికి ప్రయత్నిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటా మని ఆయన హెచ్చరించారు.



వినుకొండ: పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద కుప్పకూలిన బండి నిర్మల



టెన్షన్ టెన్షన్

- ఓటరు నాడిపై అభ్యర్థుల్లో ఆందోళన
- చివరి ప్రయత్నంగా బుజ్జగింపులు, ప్రలోభాలు
- పోలింగ్ ముందు రోజూ విచ్చలవిడిగా వైసీపీ నగదు పంపిణీ
- డబ్బులు అందలేదని పార్టీ కార్యాలయాల వద్ద ఓటర్ల పడిగాపులు



నరసరావుపేటలో ఫ్లాగ్ మార్చ్‌లో కలెక్టర్ శివ శంకర్ లోతేటి, ఎస్పీ బిందు మాధవ్

బాపట్ల, గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రచారం ముగిసింది.. ఓటనే ఆయుధంతో ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. ఈవీఎంలలో ఏ గుర్తుపై ఓటర్లు బటన్ నొక్కుతారనే టెన్షన్‌లో అభ్యర్థులు ఉన్నారు. ఇక పెద్దఎత్తున నగదు పంపిణీపై ప్రచారాల నేపథ్యంలో తమకు ఆ మొత్తాలు అందలేదనే ఆందోళనలో ఓటర్లు ఉన్నారు. సుమారు రెండు నెలల నుంచి విస్తృతంగా ఏర్పాట్లు చేసిన అధికారులు సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతం నిర్వహించాలనే టెన్షన్‌లో అధికారులు ఉన్నారు. మొత్తం మీద అటు అభ్యర్థులు ఇటు అధికారులు మధ్యలో ఓటర్లు అందరూ కూడా వారివారి రీతుల్లో టెన్షన్‌లో ఉన్నారు. మరికొద్ది గంటల్లో పోలింగ్ బూత్‌లు తెరుచుకోనుండగా ఓటర్లు ఈవీఎంలలో మీట నొక్కేందుకు సిద్ధమయ్యారు. ప్రచారం గట్టిగానే చేశాం.. ప్రత్యర్థి పార్టీలోని అసమ్మతి నాయకులను గుర్తించి మద్దతు పొందగలిగాం.. ప్రజల్లో ఆదరణ బాగానే ఉంది.. తెరవెనక పంపకాలను బాగానే చేశాం.. ఓటరు నాడీ ఏ తీరున ఉందోననే సందేహంతో అభ్యర్థుల్లో ఆందోళన. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే తమను ఎన్నికల గండం గట్టెక్కిస్తాయన్న భరోసా పాలకపార్టీ నేతలది. వీటి నేపథ్యంలో సోమవారం పోలింగ్ జరగనుండడంతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల్లో ఓటర్ల నాడిపై విస్తృతంగా చర్చ నడిచింది. ప్రచారానికి శనివారం సాయంత్రమే తెరపడడంతో ఆదివారం మొత్తం కీలక నేతలతో మంతనాలు, పోలింగ్ బూత్‌లకు తమ ఓటర్లను తరలించడానికి చేయాల్సిన ఏర్పాట్లు తదితర అంశాలపై కసరత్తు చేశారు. కొన్ని దగ్గర్ల ప్రలోభాల పర్వాలు కూడా కొనసాగాయి. ద్వితీయశ్రేణి నేతల్లో ముఖ్యమైన వారితో అంతర్గత సమావేశాలను ఆదివారం అభ్యర్థులు ఏర్పాటు చేసుకున్నారు. పంపకాల పర్వం అంతా సజావుగా జరిగిందా లేదా అని ఆరా తీయడంతో పాటు పోలింగ్ రోజు ప్రత్యర్థిపార్టీల ఎత్తుగడలు ఎలా ఉండనున్నాయి అనే కోణంలో కూడా నేతలతో సమీక్ష జరిపి తాము అనుసరించాల్సిన వ్యూహాలను కూడా వారికి చెప్పారు. సోమవారం పోలింగ్ డే కావడంతో అభ్యర్థులంతా ఓటింగ్ సరళిపైనే దృష్టి పెట్టనున్నారు. ప్రత్యర్థిపార్టీలకు పట్టు ఉన్న బూత్‌లపై ఇరుపార్టీలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి.

కొనసాగిన పంపకాలు

ఓటర్లకు ప్రలోభాలు ఆదివారం కూడా కొనసాగాయి. నగదుతో ఎలా గైనా ఓటుని కొనుగోలు చే సేందుకు అధికార వైసీపీ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నది. ఇంకా ఎవరికైనా నగదు ఇవ్వకపోయి ఉంటే వారికి సోమవారం అయినా ఇస్తామని చెబుతూ ప్రలోభ పెడుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి మఫ్టీ పోలీసులు తిరిగారు తప్ప పెద్దగా డబ్బు, మద్యం పంపిణీని అరికట్టలేకపోయారు. కొందరైతే చూసీచూడనట్లుగా వదిలేశారు. దీంతో వైసీపీ కార్యకర్తలు యథేచ్ఛగా డబ్బు పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు ప్రయత్నించారు. వైసీపీ ఈ దఫా పూర్తిగా ఓటర్లకు డబ్బు పంపిణీ పైనే ఎన్నికల్లో ఆధారపడింది. ఇందుకు కారణం తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రకటించిన మేనిఫెస్టో ముందు ఆ పార్టీ హామీలు తేలిపోయాయి. కాగా వైసీపీ ఇచ్చిన మేనిఫెస్టో గురించి ఎక్కడా చర్చ కూడా జరగలేదు. దీంతో ఆ పార్టీ అభ్యర్థులంతా ఓటర్లకు నగదు పంపిణీ చేసి ఎలాగైనా గెలువాలని కుతంత్రాలు చేస్తూనేఉన్నారు. ఓటుకు రూ.వెయ్యి నుంచి గరిష్ఠంగా రూ.3,500 వరకు నియోజక వర్గాన్ని బట్టి పంపిణీ చేశారు. కొన్ని చోట్ల తమకే ఓటు వేయాలని ప్రమాణం చేయించుకున్నారు. కాగా కొంతమంది అభ్యర్థుల అనుచరులు ఓటర్లకు డబ్బు పంచుతామని నేతల వద్ద తీసుకుని వాటిని నొక్కేశారు. దాంతో ఆదివారం పలువురు అభ్యర్థుల ఆఫీసుల, వార్డుల్లోని పార్టీ కార్యాలయాల ఎదుట ఓటర్లు పడిగాపులు కాశారు. సాయంత్రం వరకు వేచి చూసి ఓపిక నశించి శాపనార్థాలు పెట్టుకుంటూ వెనుదిరిగారు.



ఓటు వేసిన వెంటనే వెళ్లేందుకు ప్రణాళిక

ఇతర ప్రాంతాల నుంచి ఓటు వేసేందుకు జిల్లాకు వచ్చిన వారు ఓటు వేసిన వెంటనే వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. సోమవారం సాయంత్రం వరకే సెలవు కారణంగా ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా ఓటు వేసి వెళ్లాలనే ఆలోచనలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు ఉన్నారు. ఆది వారం రైల్వే రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్ల వద్ద తత్కాల్ సమయంలో విపరీతమైన డిమాండ్ తలెత్తింది. వేజండ్ల లాంటి చిన్న రైల్వేస్టేషన్‌లోనే 40 వరకు తత్కాల్ ఫారంలను ప్రయాణికులు పెట్టారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అయితే వారిలో కేవలం 10 మందికి మాత్రమే బుకింగ్ అయ్యాయి. సోమవారం మధ్యాహ్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ నుంచే తిరుగు ప్రయాణాలు ప్రారంభం కానున్నాయి. రైల్వే శాఖ రెగ్యులర్ రైళ్లతో పాటు గుంటూరు మీదగా సికింద్రాబాద్‌కు సోమవారం ఏడు ప్రత్యేక రైళ్లను నడపబోతోన్నది. అలానే ఏపీఎస్ఆర్‌టీసీ, టీఎస్ఆర్‌టీసీ కూడా వందల సంఖ్యలో స్పెషల్స్‌ని ఏర్పాటు చేశాయి.

పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా అపహరణ

కారంపూడి: మండలంలోని పేటసన్నిగండ్ల శివారు సింగరుట్లతండాలోని ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కేంద్రంలోని సీసీ కెమెరా, కేబుల్ వైరును అపహరించారు. అత్యంత సమస్యాత్మక నియోజకవర్గమైన మాచర్ల పరిధిలో 299 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసింది. ఆదివారం ఉదయం కేంద్రానికి వచ్చిన ఎన్నికల సిబ్బంది సీసీ కెమెరా, కేబుల్ వైరు అపహరణకు గురైఉండటాన్ని గుర్తించి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రామాంజినేయులు కేసు నమోదు చేశారు. పోలింగ్ కేంద్రంలో మరో సీసీ కెమెరా, కేబుల్ వైరు ఏర్పాటు చేశారు.

ఓటు.. నోటు.. యాప్

గుంటూరులో వైసీపీ సాంకేతిక రాజకీయం

ఓటర్లకు డబ్బు పంపిణీ చేసేందుకు గుంటూరు పరిధిలోని ఓ కీలక నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి సాంకేతిక తను ఉపయోగించుకున్నారు. సాఫ్టువేర్ కంపెనీలు ఉన్న ఆ అభ్యర్థి ప్రత్యేకంగా ఓ యాప్‌ని తయారు చేయించి వైసీపీ కార్యకర్తల స్మార్ట్‌ఫోన్లలో ఇన్‌స్టాల్ చేయించారు. ఆ యాప్‌లో నియోజకవర్గ ఓటర్ల వివరాలను చేర్చారు. ప్రతీ ఇంటికి వైసీపీ కార్యకర్తలు వెళ్లి ఆ యాప్‌ని ఓపెన్ చేసి అందులో పోలింగ్ బూత్, సీరియల్ నెంబరు వారీగా ఓటరు వివరాలను శోధించి ఓటుకు రూ.2 వేల చొప్పున పంపిణీ చేశారని సమాచారం. పంపిణీ అనంతరం ఓటరు సీరియల్ నెంబరు పక్కన టిక్ మార్కు చేశారు. ఆ సమాచారం రియల్‌టైంలో యాప్‌లో అప్‌లోడింగ్ చేశారు. ఈ విధంగా ఒక ఓటరుకు ఒకసారి మాత్రమే డబ్బు పంపిణీ చేసేలా స్కెచ్ వేసి అమలు చేశారు. ఈ విధంగా వైసీపీ కేవలం నగదు పంపిణీ పైనే ఆధారపడింది. కాపు సామాజికవర్గం నేతల వద్దకు ఆ పార్టీ నాయకులు వెళ్లి ఇక్కడ జనసేన పోటీ చేయడం లేదు కాబట్టి ఓటు మాకే వేయాలని, రేపు కూటమి అధికారంలోకి వస్తే తాము పార్టీ మారతామని చెప్పారు. అయితే అందుకు వారు అంగీకరించలేదని తెలిసింది.

ఉద్యానానికి ఉరి



ఉద్యాన పంటలకు రాయితీలు, ప్రోత్సాహకాలతో 2014 నుంచి 2019 వరకు ఉద్యాన పంటల సాగు విషయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులకు స్వర్ణయుగం నడిచింది. క్రమం తప్పకుండా రాయితీలు అందించడంతో పాటు ఎక్కువమంది రైతులను ఉద్యాన పంటల సాగు వైపు మళ్లించడానికి అప్పటి ప్రభుత్వం పెద్ద యజ్ఞమే చేసింది. దాదాపు రూ.100 కోట్లపైనే అప్పటి ప్రభుత్వం ఒక్కో జిల్లాకు రాయితీల కోసం వెచ్చించింది. ఈ ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 80,000 హెక్టార్ల వరకు ఉద్యాన పంటల సాగు వెళ్లింది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అసలు ఉద్యాన పంటలు, సాగు గురించే ఆలోచించలేదు. దీంతో పాటు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చినా వారికి ప్రోత్సాహం అందించలేదు. పైగా రాయితీలు ఇవ్వకుండా నానుస్తూ వచ్చింది. దీంతో ఈ ఐదేళ్లుగా ఉద్యాన పంటల సాగు అంతంతమాత్రంగానే ఉంది. అదే గత టీడీపీ ప్రభుత్వం లాగే ఈ ఐదేళ్లలోనూ అదే ఒరవడి కొనసాగి ఉంటే ఉద్యాన పంటల సాగు ఉమ్మడి గుంటూరు జిల్లాలో లక్ష హెక్టార్ల మార్కును తాకి ఉండేది. కానీ అలాంటిదేమి జరగకపోగా ఏటికేడు సాగులో తీసికట్టు నమోదవడం గమనార్హం.

- వైసీపీ పాలనలో తిరోగమనం
- ఐదేళ్లుగా పంటల రాయితీలకు మంగళం
- కేంద్రం నిధులను దారి మళ్లించిన రాష్ట్ర ప్రభుత్వం
- బాపట్ల జిల్లా రైతులకే రూ.200 కోట్లపైగా ఎగనామం
- ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా రూ.500 కోట్లపైమాటే
- నాడు ప్రోత్సాహం.. నేడు తిరస్కారం

బాపట్ల, మే12 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పంటల సాగుతో రైతులు నష్టపోతున్నారు. నానాటికి ఆయా పంటల సాగు కష్టంగా మారుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. లాభాలు అత్యధికంగా ఆర్జించే ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి పెడుతున్నారు. అయితే సంప్రదాయ పంటలసాగుతో పోలిస్తే ఉద్యాన పంటల సాగుకు పెట్టుబడి అధికం. దీంతో ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టి సారించి ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు రాయితీలు, విత్తనాలు అందించాలని నిర్ణయించాయి. కేంద్ర ప్రభుత్వ సహకారంతో గత టీడీపీ ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించింది. అయితే టీడీపీ పాలన పురోగమనానికి చిరునామాగా ఉంటే వైసీపీ ఐదేళ్లలో నామమాత్ర ఖర్చు కూడా ఉద్యాన పంటల సాగు ప్రోత్సాహకాల కోసం ఖర్చు పెట్టలేదు. పైగా బకాయిల చెల్లింపుల విషయంలో ఇప్పటికీ అతీగతి లేకుండా చేసింది. పైగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను సైతం దారి మళ్లించి ఉద్యాన రైతుల నోట్లో మట్టి కొట్టిన ఘనత వైసీపీ ప్రభుత్వానిది. మరోవైపు ఏడాదిన్నర క్రితం ఉద్యాన పంటల కోసం జిల్లాల వారీగా ప్రణాళికలు రచించామని, ఇక నిధుల కేటాయింపే తరువాయి అనే ఉపన్యాసాలు ఇచ్చి నిలువునా వంచించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ హయాంలో 70 వేల మందికి లబ్ధి..

ఉద్యాన పంటలసాగుకు మేలైన విత్తనాల కోసం షేడ్‌నెట్, పాలీహౌస్ వంటివాటితో పాటు మల్చింగ్ షీట్లు కూడా అవసరం అవుతాయి. టీడీపీ హయాంలో నిమ్మ, జామ, బొప్పాయి, మామిడి తోటల విస్తరణకు క్రమం తప్పకుండా రాయితీలను అందించింది. ఎకరాకు రూ.5,000 వరకు ఈ ప్రోత్సహకాన్ని అందించేవారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం ఉండేది. ఇదేకాకుండా బిందు, తుంపర సేద్యం ప్రాజెక్టులను గ్రామాలను యూనిట్‌లుగా తీసుకుని అమలు చేసేది. ఏటా ఈ లక్ష్యాన్ని పెంచుకుంటూ దాదాపు 10,000 ఎకరాలను డ్రిప్ పరిధిలోకి తెచ్చింది. 4,000 ఎకరాల్లో మల్చింగ్ షీట్ రాయితీలను ఇచ్చింది. ఇవే కాకుండా ప్యాక్ హౌస్‌లు, కోల్డ్ స్టోరేజీలు, రాయతీలపై ఏసీ వాహనాలు ఇలా ఉద్యాన రంగ పురోగమనానికి కృషి చేసింది. టీడీపీ ప్రభుత్వ ఐదేళ్లలో వివిధ పథకాల ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 70,000 మంది రైతులకు లబ్ధి చేకూరింది

వైసీపీ పాలనలో తిరోగమనం..

వైసీపీహయాంలో ఉద్యానరైతులకు గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నారు. రాయితీలను ఎత్తివేయడంతోపాటు బకాయిల విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. ఉద్యాన పంటల సాగును తిరోగమన బాట పట్టించిన ఘనత వైసీపీ ప్రభుత్వానిది. 2019 నాటికి ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 80,000 హెక్టార్ల వరకు సాగు జరిగింది. బాపట్ల జిల్లాలో ఈ పంటల సాగు 37,000 హెక్టార్ల వరకు వెళ్లింది. 2020 నుంచి వరుసగా నాలుగేళ్ల తగ్గుముఖమే తప్ప వృద్ధి లేదు. ఈ ఏడాది ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉద్యాన పంటల సాగు సగటున 50,000 హెక్టార్లలోపుకే పరిమితమైనట్లు తెలుస్తోంది. రైతుల నష్టపోయిన రాయితీల మొత్తం విలువ గడచిన ఐదేళ్లలో ఉమ్మడి గుంటూరుజిల్లా వ్యాప్తంగా రూ.500 కోట్లకు పైమాటేనని అంచనా.

బకాయిలకు లభించని మోక్షం

ఉద్యాన రైతులకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో దాదాపు మూడున్నరేళ్ల నుంచి వైసీపీ ప్రభుత్వం దాగుడుమూతలు ఆడుతూ వస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే పెండింగ్ ఉన్న రాయితీ బకాయిలు రూ.50 కోట్లుకాగా, ఒక్క బాపట్ల జిల్లావరకు ఈ మొత్తం సుమారు రూ.20 కోట్లు వరకు ఉన్నట్లు సమాచారం. రాయితీలు అందించకపోగా బకాయిల విషయంలో ఏళ్ల తరబడి రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. వీటిలో 60 శాతం మేర గడచిన ఏడాది చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు. కొన్ని బకాయిలను సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్‌తో సరిపెట్టినట్లు తెలుస్తోంది. కేంద్రం ఇచ్చే రాయితీలను కూడా రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయకుండా వేరే అవసరాలకు మళ్లించడంతో గడచిన ఏడాది కేంద్రం ప్రత్యేక ఖాతాలు తెరిపించి వాటిలో రాయితీ సొమ్ము జమ చేయడం వల్లే కొన్ని బకాయిలకైనా మోక్షం లభించిందనేది సమాచారం

రైతులను మోసం చేయడానికి మరో ఎత్తుగడ..

ఉద్యాన పంటల సాగును పట్టించుకోకుండా ఏళ్ల పాటు కుంభకర్ణ నిద్ర పోయిన వైసీపీ ఏడాదిన్నర క్రితం రాయితీ ప్రణాళికలంటూ సరికొత్త పల్లవిని ఎత్తుకుంది. ఇందులో భాగంగా ఒక్క బాపట్ల జిల్లాకే రూ.25కోట్లతో ఉద్యాన సాగు ప్రణాళికలంటూ ఊదరగొట్టింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ ప్రణాళికల్లో కేటాయించిన వాటా రూ.60 కోట్లకు పైమాటే. ఇవి కూడా పేపర్లకే పరిమితమయ్యాయి తప్పితే ఒక్క రూపాయి నిధులు విదిల్చిన పాపాన పోలేదు.

వైసీపీ గూండాల అరాచకం



వైసీపీ గూండాల దాడిలో గాయపడిన టీడీపీ సానుభూతిపరులు

- టీడీపీ ఏజెంట్లుగా కూర్చుంటే చంపేస్తాం
- టీడీపీ నేతల గృహాలకు వెళ్లి వైసీపీ గూండాలు దాడి
- ట్రాక్టర్ ధ్వంసం

మాచర్లటౌన్, మే 12: వైసీపీ గూండాలు బరితెగించారు. ఎన్నికల రోజు ఏజెంట్‌గా కూర్చుంటే చంపేస్తాం నా.. అంటూ బెదిరింపులకు దిగారు. టీడీపీ నేతలు ఎదురు తిరగడంతో దాడికి పాల్పడ్డారు వైసీపీ గూండాలు. టీడీపీ సానుభూతిపరుల నివాసాలపై వైసీపీ నేతలు అత్యంత పాశవికంగా దాడి చేసిన ఘటన రెంటచింతలలో ఆదివారం జరిగింది. రెంటాలకు చెందిన మల్లయ్య, సిద్ధయ్యలు సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెంటాల పోలింగ్ బూత్‌ల్లో ఏజెంట్లుగా కూర్చున్నేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న వైసీపీ నేతలు మోర్తాల ఉమామహేశ్వరరెడ్డితోపాటు మరో 30 మంది వైసీపీ గూండాలు రెంటచింతలలోని వైఆర్‌ఎస్ హైస్కూల్ సమీపంలో నివాసముంటున్న టీడీపీ నేతలు మల్లయ్య, సిద్ధయ్యల గృహాలకు వెళ్లారు. ఆ సమయంలో సిద్ధయ్య, మల్లయ్యలు భోజనం చేస్తుండగా కంచం లాగేసి ఛాతి భాగాన ఎగిరి తన్నారు. అంతటితో ఆగకుండా విచక్షణా రహితంగా రాడ్లు, కర్రలతో దాడి చేసి గాయపరిచారు. మహిళలపై దుర్భాషలాడారు. ట్రాక్టర్‌ను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో టీడీపీ నాయకులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ సానుభూతిపరులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని వైసీపీ నేతలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కారంపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నారాయణస్వామి సకాలంలో అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పోలీసులు సకాలంలో రాకుంటే ప్రాణాలు పోయేవని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు వచ్చి వైసీపీ గూండాలు నుంచి కాపాడారన్నారు. జరిగిన దాడిపై టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైసీపీ దాడులకు బయపడేది లేదు ... బ్రహ్మారెడ్డి

వైసీపీ దాడులకు భయపడేది లేదని, తమ కార్యకర్తలను కాపాడుకుంటామని, వారికి అండగా ఉంటామని, ఎవరూ భయపడాల్సిన పనిలేదని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి బాధితులకు భరోసానిచ్చారు. ఆదివారం జరిగిన సంఘటనపై రెంటచింతల పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ నారాయణస్వామికి బ్రహ్మారెడ్డి వివరించారు. పార్టీలకు అతీతంగా వ్యవహరించాలని, సమన్యాయం అందరికీ వర్తించేలా చూడాలని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నేతలపై దాడుల పరంపర కొనసాగుతోందని, దీనికి అంతం లేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ నేత సిద్ధయ్యపై వైసీపీ నేతలు దాడి చేసి ట్రాక్టర్‌ను ధ్వంసం చేయడం, అన్నం తింటుండగా కంచం లాగడం అరాచకమన్నారు. పోలింగ్ ముందు రోజు తమ పార్టీ ఏజెంట్లను భయభ్రాంతులకు గురిచేయడం, దాడులు చేయడం అనాగరిక చర్య అన్నారు. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే పోలింగ్ రోజున అధికారపార్టీ అరాచకాలను ఊహించడం కష్టంగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా దౌర్జన్యాలు, హింస మార్గాలకు స్వస్తి పలికి ఎవరి ఓటు వారు వేసుకునేలా వ్యవహరించాలని, అందుకు పోలీసులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బాధితులను పరామర్శించి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. టీడీపీ బడుగు, బలహీనుల పార్టీ అని అన్నారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు చప్పారపు అబ్బిరెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, శౌర్రెడ్డి, కాయితి రవికృష్ణారెడ్డి, బాలయ్య, ఆదూరి శివ, ముని నాయక్ ఉన్నారు.



వైసీపీ నేతల దాడిలో ధ్వంసమైన ట్రాక్టర్

ఏజెంట్లుగా నిలబడతారా... అంతు చూస్తాం
- కాకిరాలలో వైసీపీ గూండాల వీరంగం

దుర్గి : ఏజెంట్లుగా నిలబడతారా.. మీ అంతు చూస్తాం అంటూ వైసీపీ గూండాలు వీరంగం సృష్టించి దాడులకు తెగబడ్డారు. ఈ దాడుల్లో ఇరువురు టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. మండలంలోని కాకిరాలలో ఆదివారం మించాలపాడుకు చెందిన సింగంశెట్టి నాగమధు, మిర్యాల సైదులు అనే టీడీపీ కార్యకర్తలు ఏజెంట్లుగా ఉండేందుకు ఫారంలు పూర్తి చేస్తున్నారు. ఈ సమయంలో సుమారు 15 మంది వైసీపీ గూండాలు కర్రలతో పోలింగ్ బూత్‌వద్దకు వచ్చి ఏజెంట్లకు నిలబడేటంత మొనగాళ్లారా మీరు.. చంపేస్తాం.. అంటూ దాడులు చేశారు. ఈదాడిలో టీడీపీ కార్యకర్తలు సింగంశెట్టి నాగమధు తలకు గాయం కాగా, మిర్యాల సైదులు చేతికి గాయమైంది. దాడి జరిగే సమయంలో పోలీసు కానిస్టేబుల్ ఒకరు మాత్రమే ఉన్నారని, గొడవ జరుగుతున్నప్పటికీ అతను కూడా పక్కకు వెళ్లిపోయాడని గ్రామస్తులు చెబుతున్నారు. వైసీపీకి చెందిన బొజ్జా వెంకటనారాయణ, మూఢావత్ శ్రీను, కనకరాజు వెంకయ్య, రాజేష్, పోట్లూరి లక్ష్మయ్య, నాగయ్య, మంగమ్మ, పసుపులేటి వెంకటేశ్వర్లు, చిన్ని, బూదాని అంజి, కొంగా నాగేశ్వరరావు, ఉడతల జగన్‌తోపాటు మరికొందరు తమపై దాడిచేసినట్లు బాధితులు తెలిపారు. ఫిర్యాదు చేసేందుకు బాధితులు దుర్గి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు.



గుంటూరులో ఓ అన్నా క్యాంటిన్ దుస్థితి ..



పిచ్చి మొక్కల మధ్య నరసరావుపేట స్టేడియం వద్ద అన్న క్యాంటీన్

పేదల కడుపు కొట్టారు

- వైసీపీ కుట్రతో అన్న క్యాంటీన్ల మూత
- ఐదేళ్ల క్రితం ఆకలి తీర్చిన భోజనాలయాలు
- పేరు, రంగులు మార్చి పాడు పెట్టిన జగన్

(గుంటూరు,నరసారవుపేట/ఆంధ్రజ్యోతి, తెనాలి అర్బన్)

అన్న క్యాంటీన్లు.. నాడు పేదల ఆకలి తీర్చే భోజనాలయాలు. నేడు చెత్తాచెదారాలతో నిండి శిథిలావస్థకు చేరి అసాంఘీక కార్యకలాపా లకు నిలయాలు. అన్నార్తులకోసం చంద్రబాబు ముఖ్య మంత్రిగా అతి తక్కువ ధరకు, నాణ్యమైన ఆహారాన్ని అందిం చేందుకు మున్సిపల్ కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. నిత్యం పేదలు, దినసరి కూలీలు, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చే వారి ఆకలి తీర్చేలే ఈ అన్నక్యాంటీన్లను రూపొం దించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారం లోకి వచ్చీరాగానే జగన్ సీఎం పీఠం ఎక్కు తూనే వాటికి మరణశాసనాన్ని లిఖించారు. తొలుత పార్టీ రంగులు అద్దించారు.. ఆపై పేరు మార్చారు.. అయినా వీటిని కొనసాగిస్తారని ఆశించిన పేదలకు 58 నెలలుగా నిరాశే ఎదు రైంది. అన్న క్యాంటీన్ల ఉనికే లేకుండా చేసేశారు. కరోనా సమయంలో జగన్ మనస్సు కరిగి రాజన్న క్యాంటీన్ల (అన్న క్యాంటీన్ల)ను కొనసాగి స్తారని అందరూ ఆశించారు. అయితే ప్రభుత్వం ఆ దిశగానే ఆలోచన చేయలేదు. తమిళనాడులో అమ్మ క్యాంటీన్ల స్ఫూర్తితో చంద్రబాబు రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల పేరుతో అదే విధానాన్ని అమల్లోకి తీసుకురాగా సీఎం జగన్ వాటిని పాడుబెట్టేశారు. నిత్యంసూర్యోదయాన రుచికరమైన ఫలహారాన్ని, మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని రూ.5 చొప్పున వడ్డించేవారు. కూలినాలి చేసుకునేవారు భోజనానికి ఇబ్బంది లేదన్న భరోసా అన్న క్యాంటీన్లతో ఏర్పడింది. పేదల ఆకలి తీర్చేందుకు ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉన్న ఈ కేంద్రాలు పేదల భోజన ఆలయాలుగా విలసిల్లాయి. వీటితో చంద్రబాబుకి మంచిపేరు రావడం జీర్ణించుకోలేకనే జగన్ మూతేయిం చారని పలువురు విమర్శించినా వైసీపీ పాలకులు పట్టించుకోలేదు.



అన్నక్యాంటీన్‌లో ఆహార పట్టిక

పక్క రాష్ట్రాల్లో కొనసాగింపు.

తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారినా అక్కడ అధికారంలోకి వచ్చిన వారు విధానాలను మార్చలేదు. పేదల ఆకలి తీర్చే భోజన ఆలయాలను యథాతథంగా కొనసాగిం చారు. అయితే ఇక్కడ అంతా రివర్స్‌గా వ్యవహరించిన వైసీపీ నేతలు పేదల కడుపుపైనా కొట్టారు. పేదలకు మూడు పూటలా ఆహారాన్ని అందిస్తూ సర్వత్రా ఆదరణపొందిన అన్న క్యాంటీన్లతో చంద్రబాబుకు పేరు వస్తుందని తొలుత రంగులు మార్చారు, ఆతర్వాత తండి పేరు పెట్టుకు న్నారు. అయినా కక్ష తీరని ప్రభుత్వం ఏకంగా వాటిని పాడుపెట్టేసింది. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధి లోని అన్నక్యాంటీన్ల భవనాల నిర్వహణను సంబంధిత అధికారులు గాలికొదిలేశారు. దీంతో ఆయాభవనాల్లో వ్యర్థాలు పెరుకుపోయాయి. కొన్ని దగ్గర్ల అసాంఘీక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారాయి. ఆకలి తీర్చిన భవనాలు శిథిలా వస్థకు చేరుకోవడంతో పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు నగరంలోని మిర్చియార్డు, చుట్టుగుంట, నల్లచెరువు, అమరావతిరోడ్డు, పల్నాడు బస్టాండ్, నందివెలుగురోడ్డులో, తెనాలిలో మార్కెట్ సెంటర్, బస్‌స్టేషన్, మార్కెట్ యార్డు, నరసరావుపేట సేడియం వద్ద ఉన్న ఈ భవనాలు ప్రస్తుతం కనిపించనంతగా పిచ్చి మొక్కులతో నిండిపోయాయి.



నరసరావుపేటలో అధ్వాన్నంగా మార్కెట్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్



తెనాలి బస్ స్టేషన్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్

ఇసుక ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

భట్టిప్రోలు, మే 12: ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని చింతమోటు గ్రామం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెదలంక కాకులడొంక నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి మండలంలోని చింతమోటు గ్రామం వద్ద బోల్తా కొట్టింది. ఈ ఘటనలో పెదలంక గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ దున్నా శ్రీధర్ (27) ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



గల్లా జయదేవ్‌తో మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

పెమ్మసాని చంద్రశేఖర్‌తో

ఎంపీ గల్లా జయదేవ్ భేటీ

గుంటూరు, మే12(ఆంధ్రజ్యోతి): గుంటూరు సిట్టింగ్ ఎంపీ గల్లా జయదేవ్ సోమవారం తన ఓటు హక్కుని వినియోగించుకు నేందుకు ఆదివారం సాయంత్రం గుంటూరుకు చేరుకున్నారు. ఆయన పశ్చిమ నియోజకవర్గంలో తన ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎంపీ గల్లా జయదేవ్ వచ్చిన విషయం తెలుసుకున్న గుంటూరు పార్లమెంట్ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఎంపీ గల్లా జయదేవ్‌ను విందుకు ఆహ్వానించారు. ఈమేరకు ఆదివారం రాత్రి ఎంపీ గల్లా జయదేవ్ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నివాస గృహానికి చేరుకొని ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ గల్లాను పెమ్మసాని చంద్రశేఖర్ దుశ్శాలువా, బొకేతో ఘనంగా సత్కరించారు.

అదనపు బోగీ ఇచ్చారు..

పీఆర్ఎస్‌లో చూపలేదు

- సికింద్రాబాద్ - రేపల్లె ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణీకుల ఇక్కట్లు

గుంటూరు,మే12 (ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్ -రేపల్లె ఎక్స్‌ప్రెస్‌కి అదనపు స్లీపర్ క్లాస్(ఎస్ఈ1) భోగీని జత చేసి దానికి సంబంధించి పీఆర్ఎస్‌లో ఎనేబుల్ చేయడాన్ని రైల్వేశాఖ మరిచింది. దాంతో ఆదివారం వెయిటింగ్ లిస్టులో ఉన్న ప్రయాణీకుల్లో ఏ ఒక్కరికి కూడా టిక్కెట్‌లు కన్‌ఫర్మ్ కాలేదు. ఈకారణంగా ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడి జిల్లాకు చేరుకొ న్నారు. సాదారణంగా వెయిటింగ్ లిస్టులు చాంతాడంత ఉంటే అదనపు భోగీలను ఏర్పాటు చేసి కొంతమేరకు వాటిని క్లియర్‌చేస్తారు. అవిధంగా రేపల్లె ఎక్స్‌ప్రెస్‌కి ఆదివారం వెయిటింగ్ లిస్టులో 300లకు పైగా టిక్కెట్‌లు బుక్ అయ్యాయి. వీరంతా హైదరా బాద్‌లో నివసిస్తూ ఓటు వేసేందుకు స్వస్థలాలకు బయలుదేరిన వారే. అదే ఎస్ఈ-1 భోగీని పీఆర్ఎస్‌లో ఎనేబుల్ చేసి ఉంటే కనీసం 70మందికి పైగా బెర్తులు కన్‌ఫర్మ్ అయ్యేవి. అలానే మరి కొంత మందికి కనీసం కూర్చోవడానికి ఆర్ఏసీ సీట్లు వచ్చేవి. రైల్వే శాఖ చేసిన తప్పిదం కారణంగా ఎస్ఈ-1 భోగీలో ఎవరు పడితే వారు ఎక్కారు. ప్రయాణీకుల మధ్యన గొడవలు కూడా జరిగాయి.

మూడు ముక్కలాటతో

రాష్ట్ర పరువు గంగపాలు

- 1608వ రోజుకు రైతుల నిరసనలు, ఆందోళనలు

తుళ్లూరు, మే 12: ఒక్క ఛాన్స్ ఇవ్వండి పరిపాలన ఎంతో ఉన్నతంగా చేసి చూపిస్తానని చెప్పిన సీఎం జగన్‌రెడ్డి.. ఈ ఐదేళ్లలో ఎక్కడ అభివృద్ధి అనేది లేకుండా చేశారని రాజధానికి 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద ఉండి మహిళలు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు ఆదివారం నాటికి 1608వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, జగన్‌రెడ్డికి రెండవ ఛాన్స్ ఇస్తే ఆంధ్రుల మనుగడే ఉండదన్నారు. వైసీపీకి ఓటు వేస్తే అరాచక శక్తులు రాజ్యమేలుతాయని స్పష్టం చేశారు. మూడు ముక్కల ఆటతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారన్నారు. వార్షిక కౌలు ఇవ్వకుండా రైతులను పస్తులు పెడుతున్నారన్నారు. రాజధాని కోసం జీవనాధారమైన భూములిస్తే నరకం చూపిస్తున్నారని ఆవేద వ్యక్తం చేశారు. సీఎం జగన్‌రెడ్డి పరిపాలన చేసిన ఈ ఐదేళ్లలలో రాష్ట్రానికి ఏ ఒక్క పరిశ్రమ వచ్చిన దాఖలాలు లేవన్నారు. నిరుద్యోగ యువత పెరిగిపోయిందన్నారు. అమరావతి అభివృద్ధి కొనసాగితే లక్షల ఉద్యోగాలు వచ్చేవన్నారు. మూడు రాజధానుల ప్రతిపాదన జగన్‌రెడ్డికి సొంత ప్రయోజనం కోసమేనన్నారు. అభివృద్ధి చేసే నాయకుడికి ఓటు వేయాలని విన్నవించారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో రైతుల నిరసనలు, ఆందోళనలు కొనసాగాయి.



బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు


నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00


పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి
పెదకూరపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బ్యాలెట్ నమూనా (ఈ.వి.ఎం)
Ready
Ballot Unit
1
2
3 భాష్యం ప్రవీణ్
4
5
6
7
8
9
10
వరుస నెం.
3
నేడు జరుగుచున్న అసెంబ్లీ ఎన్నికలలో 3వ నెంబర్ సైకిల్ గుర్తు పై మీ అమూల్యమైన ఓటు వేసి, వేయించి పెదకూరపాడు నియోజకవర్గ టిడిపి, జనసేన మరియు బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ గారిని అత్యధిక మెజారిటీతో గెలిపించ ప్రార్ధన
సైకిల్ గుర్తుకే మన ఓటు
భాష్యం ప్రవీణ్ గెలుపు !
పెదకూరపాడు నియోజకవర్గ
అభివృద్ధికి మలుపు !!
MCMC Reference No :28/2024
పోలింగ్ తేది : 13-05-2024
సదా మీ సేవలో
భాష్యం ప్రవీణ్
పెదకూరపాడు నియోజకవర్గం
టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి

జన కేతనం

ఆంధ్రజ్యోతి

పల్నాడు జిల్లా వార్తలు

8

సోమవారం 13 మే 2024



శంకుస్థాపనకే పరిమితమైన వరికపూడిశెల ప్రాజెక్టు



దాచేపల్లిలో అధికారులు స్వాధీనం చేసుకున్న పటిక బస్తాలు

ప్రజల ప్రాణాలతో చెలగాటం

● గుట్కా, నాటుసారా అమ్మకాల కేంద్రంగా దాచేపల్లి

● పట్టించుకోని అధికారులు

దాచేపల్లి, మే 12: వైసీపీ పాలనలో అవినీతికి కాదేదీ.. అనర్హం. నాటుసారా, ఖైనీలు, గుట్కాలు, ఇసుక, మైనింగ్ క్వారీలు వంటి అక్రమాలకు దాచేపల్లి ఖిల్లాగా మారింది. వైసీపీ పాలనలో దాచేపల్లి కేంద్రంగా గుట్కా వ్యాపారం జోరుగా సాగుతుంది. ఇక్కడి నుండే పిడుగురాళ్ల, చిలకలూరిపేట, వినుకొండ, నరసరావుపేట, కారంపూడి వంటి ప్రాంతాలకు గుట్కాలు బస్తాలలో రవాణా సాగుతున్నాయన్న ఆరోపణలు వున్నాయి. వైసీపీ నాయకుల ఏలుబడిలో లాభాపేక్షే ధ్యేయంగా అన్నిరకాల అక్రమాలకు తెరతీశారు. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, నల్గొండ, ఖమ్మం తదితర ప్రాంతాల నుండి టన్నుల కొద్దీ ఖైనీ బస్తాలు హద్దులు దాటి దాచేపల్లికి చేరుకుంటున్నాయి. దాచేపల్లి మండలంలో ఏ చిన్నపాటి కిల్లీబంకుల్లో గాని, కిరాణా షాపుల్లో గాని గుట్కాలు, ఖైనీలు దొరకని చోటు వుండదంటే నమ్మశక్యం కాదు. ప్రభుత్వ అనుమతిలేని పాన్‌మసాలాలు విస్తారంగా లభించడం జరుగుతుంది. ఈ ప్రాంతంలో వ్యవసాయ కూలీలు, కార్మికులు పేద బడుగు బలహీనవర్గాల ప్రజలు అధికంగా నివాసముంటారు. సిమెంట్ ఫ్యాక్టరీలు, ముగ్గుమిల్లులు, మైనింగ్ క్వారీలు విస్తారంగా వున్నాయి. ఆయా క్వారీలలో అధికంగా పనిచేసే కార్మికులు ఈ గుట్కాలకు అలవాటుపడి అనారోగ్యం పాలు చేసుకుంటున్నారు. ఇదిలా వుండగా, నాటుసారా తయారీలో ఉపయోగించే నల్లబెల్లం, పటిక బస్తాల కొద్దీ పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నల్లబెల్లం దాచేపల్లిలో విస్తారంగా లభిస్తుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాటుసారాకు అవసరమైన ముడిసరుకు అంతా లభ్యం కావడంతో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వాడపల్లి, దామరచర్ల, మేళ్లచెరువు, హుజూర్‌నగర్, కోదాడ వంటి ప్రాంతాలకు నల్లబెల్లాన్ని, పటికను తరలిస్తారనేది సమాచారం. నాటుసారాను తయారు చేయడం ప్రభుత్వం నిషేదించింది. అయినప్పటికీ వాటి ముడిసరుకు అంతా విచ్చలవిడిగా లభ్యం కావడంతో ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వడ్డించేవాడు మనవాడైతే కడబంతిలో వున్నా అన్నీ వస్తాయన్న సామెతగా అధికారం మనదైనప్పుడు ఏదైనా చెయ్యొచ్చు అన్న భావన నేతలలో వుండటం సామాన్య ప్రజల పాలిట శాపంగా మారింది. అంతేకాకుండా గంజాయి కూడా విస్తారంగా రవాణా అవుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా అక్రమాలపై అధికారులు దృష్టి సారిస్తే మరిన్ని వివరాలు బయటకు వస్తాయనేది నిజం.





గోతాలలో వున్న నల్లబెల్లం, పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కా బస్తాలు

హామీలు.. మరిచారు

● వినుకొండకు ఇచ్చిన హామీలు మరచిన సీఎం జగన్, ఎమ్మెల్యే బొల్లా



ప్రహరీగోడకే పరిమితమైన వినుకొండ స్టేడియం

వినుకొండ, మే 12: రాజకీయ నాయకులు తమ స్వలాభం కోసం అలివికాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తరువాత మరిచిపోవడంతో పరిపాటిగా మారింది. దీనికి నిదర్శనమే వినుకొండ నియోజకవర్గం. 2019 ఎన్నికల సమయంలో నేటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వినుకొండకు వచ్చిన సమయంలో వరికపూడిశెల ప్రాజెక్టు పూర్తి చేసి బొల్లాపల్లికి సాగు, తాగునీరు ఇస్తామని హామీ ఇచ్చినా నేటికి కార్యరూపం దాల్చలేదు. మళ్లీ ఇటీవల శంకుస్థాపన చేశారు. అలాగే బొల్లాపల్లి మండలంలోని మూగచింతలపాలెం వద్ద సాగర్ కుడి ప్రధాన కాలువ డీప్ కట్ నుంచి బొల్లాపల్లి చెరువుకు నీటిని తోడిపోసి రేమడిచర్లతో పాటు మరికొన్ని గ్రామాలకు తాగునీరు అందిస్తామని 2023 ఫిబ్రవరిలో జరిగిన సభలో హామీ ఇచ్చినా ఇప్పటికీ ప్రతిపాదన దశలో ఉంది. ఇదే సభలో వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రి 100 పడకలుగా మరుస్తామని, కొత్తగా ముస్లిం మైనార్టీ, జూనియర్ కళాశాల మంజూరు చేస్తామని చెప్పి 9 నెలలు దాటినా ఇప్పటికీ మంజూరు కాలేదు. వినుకొండ పురపాలక సంఘంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బొల్లా, సీఎం జగన్ హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో దీని కోసం మంజూరైన ఏఐఐబీ నిధులు రూ.161 కోట్లు పనులు గడిచిన 5 సంవత్సరాల్లో పూర్తికాలేదు. వినుకొండకు వెటర్నరీ లేదా వ్యవసాయ కళాశాల మంజూరు చేస్తానని ఇచ్చిన సీఎం జగన్, ఎమ్మెల్యే బొల్లా హామీలు నేటికీ అమలు కాలేదు.

ఎమ్మెల్యే బొల్లా ఇచ్చిన హామీలు...

గుండ్లకమ్మ నదిపై తంగిరాల డ్యామ్ నిర్మించి నూజెండ్ల, వినుకొండ మండలాలకు సాగునీరు ఇస్తామని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు 2019 ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినా నేటివరకు అది అమలు కాలేదు. గుండ్లకమ్మ నదిపై 7 ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదు. పల్నాడు వాటర్ గ్రిడ్ ద్వారా గ్రామీణ ప్రాంతంలోని ఇంటింటికి నీటి కుళాయి ఇస్తామని ప్రకటించిన పథకం పనులు ఇప్పటివరకు మొదలుకాలేదు. వినుకొండలో స్టేడియం నిర్మిస్తామని ఇచ్చినహామీ కాంపౌండ్ వాల్‌కే పరిమితమైంది. వినుకొండలో ట్రామా కేర్ ఏర్పాటు చేస్తామని ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, ఎమ్మెల్యే బొల్లా ఇచ్చిన హామీ నేటికీ ఆ ఊసే లేదు. వినుకొండ సమీపంలో పరిశ్రమల పార్కు ఏర్పాటు చేస్తామని చెప్పిన హామీ అమలు కాలేదు. వినుకొండ పట్టణ పేదల కోసం గత ప్రభుత్వంలో మంజూరైన 5వేల ఇళ్లను 1300లకు కుదించి ఇప్పటివరకు పూర్తి చేయలేదు.

వినుకొండ ప్రాంతాన్ని వెంటాడుతున్న సమస్యలు

గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో వినుకొండ ప్రాంతానికి పలు సమస్యలు వెంటాడుతున్నాయి. వాటిలో ముఖ్యమైనవి. వినుకొండ-కొప్పెరపాడు రాష్ట్రరహదారి రెండు వరుసలతో నిర్మిస్తామని ఇచ్చిన హామీ అమలు కాకపోగా అధ్వానంగా తయారైంది. ఈపూరు -ముప్పాళ్ల వంటి ప్రాధాన్యం కలిగిన వివిధ పంచాయతీ రహదారులు నిధులు లేక అధ్వానంగా ఉన్నాయి. సమగ్ర రక్షిత తాగునీటి పథకాలు నిర్వహణ లేక మూలన పడ్డాయి. సాగర్ కాలువలకు మరమ్మతులు లేక కంపచెట్లు పెరిగి అధ్వానంగా మారాయి. వినుకొండలో ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహం శిథిలావస్థకు చేరినా నూతన నిర్మాణం జరగలేదు. ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ కోర్సు ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వంలో అదనపు భవనం నిర్మాణానికి రూ.4కోట్లు కేటాయించగా నాలుగున్నరేళ్ల నిధులు విడుదల చేయనందుకు ఇప్పటికీ భవనం పూర్తి కాలేదు. ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో అదనపు భవనాల నిర్మాణానికి నాబార్డు మంజూరు చేసిన రూ.5కోట్ల పనులు పూర్తి కాలేదు. నాడు-నేడు కింద 2వ దశలో పాఠశాలలో అభివృద్ధి పనులు నిధుల కొరతతో నిలిచాయి.

ప్రముఖుల ఓట్లు మంగళగిరిలోనే..

మంగళగిరి, మే 12: జాతీయ, రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రధాన రాజకీయ పార్టీల అగ్రనేతలు మంగళగిరిలోనే ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ వేళ పలువురు ప్రముఖులు మంగళగిరిలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అందులో భాగంగా మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి కాలనీలో ఉదయం 7 గంటలకు జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అలాగే, తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, కుటుంబ సభ్యులు కూడా ఓటు వేయనున్నారు. దీంతో మంగళగిరి నియోజకవర్గం ప్రాధాన్యతను సంతరించుకుంది.

సూపర్ ఆరుతో.. వెలుగులు

● కూటమి ఉమ్మడి మేనిఫెస్టోతో పేదల జీవితాలు బాగు ● కూటమి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు



కుంటుంబ సభ్యులతో డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట, మే 12 : కూటమి అధికారంలోకి రాగానే సూపర్ - ఆరు పథకాలు అమలు చేసి అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తాం.. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని నరసరావుపేట అసెంబ్లీ తెలుగుదేశం కూటమి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే పింఛన్‌లు అందించడం జరగుతుంది. పింఛన్‌ను నెలకు రూ.4 వేలకు పెంచుతామని, ఏప్రిల్ ఒకటి నుంచే పెంచిన పింఛన్ ఇస్తామన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 33 శాతం రిజరేవషన్లు కల్పిస్తామన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంత మంది పిల్లలు బడికి వెళ్తే అంతమందికి ఏడాదికి ఒక్కొక్కరికి రూ.15 వేలు వంతున అందిస్తాం. ఏడా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 18 ఏళ్ల నిండిన ప్రతి అపడుచుకు ఖాతాలో నెలకు రూ.1500 వేస్తాం. ఇంట్లో ఎంతమంది అడపడుచులు ఉంటే అంతమందికి ఈ పథకం వర్తింస్తుంది. జూలైన ఒకటి నుంచి ఆర్టీసీలో మహిళలకు ఉచిన బస్సు ప్రయాణం కల్పిస్తాం. మహిళా విద్య ప్రోత్సాహం అందించేందుకు కలలకు రెక్కలు పథకం తీసుకొచ్చి దీని ద్వారా దేశంలో ఎక్కడైనా కావాల్సిన కోర్సులు చదువుకోవచ్చు. ఇందుకు వడ్డీ లేని రుణాలు బ్యాంకుల ద్వారా అందస్తాం. స్వయం సహాయక బృందాలకు వడ్డీలేని రుణాలు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి ఇస్తాం. సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక పథకాలను పునరుద్ధరిస్తాం అని అరవిందబాబు వివరించారు.

ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే ఫించన్ అందజేస్తాం. ముస్లిం రిజర్వేషన్ 4 శాతంకు తెలుగుదేశం కట్టుబడి ఉంది. హిమాం, మౌజన్లకు ప్రతినెలా రూ 10వేలు, రూ 5వేలు గౌరవ వేతనం అందజేస్తాం. ఈద్గాలకు, మసీదుల నిర్వహణకు నిధులు ఇవ్వడం జరుగుతుంది. విద్యుత్ ఛార్జీలు పెంచడం జరగదు. చెత్తపన్ను రద్దు చేస్తాం. పెట్రోలు, డీజిల్ ధరలు నియంత్రిస్తాం. పేదల కడుపు నింపేందుకు అన్న క్యాంటిన్‌లను పునరుద్ధరిస్తామన్నారు. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి చేసి నదుల అనుసంధానంతో గోదావరి జలాలను సాగర్ అయకట్టుకు తరలిస్తాం. సాగర్ అయకట్టులో సాగునీటి కరువును నిర్మూలిస్తాం. అధ్వానంగా ఉన్న సాగర్ కాలువల మర్మత్తులు చేయిస్తాం. కాలవుల చివరిభూములు నీరిందంచే బాధ్యతను తీసుకుంటాను. పట్టణంలో తెలగుదేశం ప్రభుత్వం హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను వెనువెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తాం. పూర్తి వసతులు కల్పిస్తామన్నారు. వ్యాపారులకు ఇబ్బందులు కలగనివ్వం. వ్యాపారులకు ఎల్లప్పుడు అండగా నిలుస్తాను. వేధింపులు లేకుండా చర్యలు తీసుకుంటాను. యవకులు, నిరుద్యోగులు మెగా డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారు. చంద్రబాబు సీఎం కాగానే తొలి సంతకం మెగా డిఎస్సీ ఫైలుపై పెడతారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌ను రద్దు చేసేందుకుకే సీఎం అయ్యాక చంద్రబాబు రెండో సంతకం చేస్తారు.

నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి కోసం కృషి చేస్తా

నరసరావుపేట మునిసిపాల్టీలో ప్రరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తాను. సుందర పట్టణంగా తీర్చి దిద్దుతాను. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను. రహదారి భద్రత కల్పిస్తాను. నియోజకవర్గ పరిధిలో గ్రామాల రహదారులు, బైపాస్ గోతులు మయంగా ఉన్నాయి. వీటికి మరమ్మత్తులు చేయిస్తాను. పట్టణంలో ఎన్నడూ లేని విధంగా ఒక్క పూట తాగునీటి సరఫరా చేస్తున్నారు. రెండు పూటల తాగు నీటి సరఫరాను పునరుద్ధరిస్తాను. మునిసిపాల్టీలో కలసిన శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తాను. గత ఎన్నికల్లో ఓటమి చెందిన నాటి నుంచి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేశాను. కరోనా సమయంతో అనేక మందికి సేవ చేశాను. పేద విద్యార్థుల చదువు ఆర్థిక సహాయం అందించాను. పేదల రోగులకు వైద్య సేవలను అందజేశాను. ఐదేళ్లుగా ప్రజలకు ఎంతో సేవ చేశాను. ఎంతో కష్టాలను అనుభవించానంటూ భావోద్వేగానికి లోనైన అరవిందబాబు కండతడి పెట్టారు. తనను ఈ ఎన్నికల్లో అదరించండి.. ఓటు వేసి గెలిపించండని అరవిందబాబు విజ్ఞప్తి చేశారు. నరసరావుపేట నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని అరవింద బాబు హామీ ఇచ్చారు. తన భర్త వైద్య వృత్తిలో సక్సెస్ అయ్యారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. మంచి మెజార్టీతో గెలిపించాలని అరవిందబాబు సతిమణీ సుధా రాజేశ్వరి నియోజకవర్గ ప్రజలను కోరారు. అరవిందబాబు కుమార్తె అమూల్య మాట్లాడుతూ ఐదేళ్లుగా వృత్తిని, కుటుంబాన్ని పక్కన బెట్టి నియోజకవర్గ ప్రజలకు అండగా ఉన్నారని అయనను గెలిపించుకోనే సమయం అసన్నమైంది. తన తండ్రి అరవిందబాబుకు ఓటు వేసి గెలిపించి నరసరావుపేటలో నిలిచిపోయిన అభివృద్ధిని చేసుకోవాలన్నారు. నియోజవర్గ ప్రజల కోసం ఎంతో పాటుపడ్డారు. అలాంటి మంచి నాయకుడు అరవిందబాబును గెలిపించి అసెంబ్లీకి పంపించాలని అయన కుమారుడు ఆదిత్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధిని నిర్దేశించేది ప్రజల ఓటే

ప్రత్తిపాటి పుల్లారావు



ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, మే12: చిలకలూరిపేట నియోజకవర్గం, రాష్ట్రం మొత్తం ప్రజల అభివృద్ధి స్వప్నం నెరవేరాలంటే ఓటే వజ్రాయుధం అని మాజీమంత్రి, స్థానిక కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం అన్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభం కూడా చేసి అయిదేళ్ల పాటు ఆగిపోయిన అభివృద్ధి ప్రాజెక్టుల పూర్తి కోసమైనా అంతా తరలివచ్చి ఓటేయాలన్నారు. ఓట్లు వేయించుకుని తర్వాత పత్తాలేకుండా పారిపోయే వాళ్లను కాకుండా ఎల్లవేళలా అందుబాటులో ఉండే, ప్రతి అవసరానికి కదిలివచ్చే వారెవరో గమించుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. యడవల్లిలో దళితుల భూములకు పట్టాలు, 98శాతం పూర్తైన 4,512 టిడ్కో ఇళ్ల పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడం, జగనన్న కాలనీల పేరిట జరిగీన రూ.50 కోట్ల అవినీతి వెలికితీత, చిలకలూరిపేట దాహార్తి తీర్చే అమృత్ పథకాన్ని పూర్తి చేసుకోవడం, చిలకలూరిపేటలో ఆటోనగర్ నిర్మాణం, కొండవీడు కోట అభివృద్ధి, కేంద్రీయ విద్యాలయం, మైనార్టీ విద్యార్థుల చదువుల కోసం హాస్టల్ నిర్మాణం, ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకురావడం, మండలాల్లో రహదారుల నిర్మాణం, మరమ్మతులు, రెండేళ్లుగా ఆగిపోయిన బైపాస్ రోడ్డును దృష్టిలో పెట్టుకుని ప్రజలు నిర్ణయం తీసుకోవాలన్నారు. వీటన్నింటికి గత ప్రభుత్వంలోనే తాను మంత్రిగా ఉన్నప్పుడే అనుమతులు తీసుకుని వచ్చి, నిధులు తెచ్చి, పనులు కూడా ప్రారంభించినా తర్వాత జాప్యం, పనులు ఆగిపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం రాగానే ఈ పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తామనీ హామీ ఇచ్చారు. దళితులకు పట్టాలు అందుతాయని, టిడ్కోలు ఇళ్ల పూర్తి చేసి లబ్దిదారులతో గృహప్రవేశాలు చేయించే బాధ్యత తానే తీసుకుంటానన్నారు. అమృత్ పథకం పూర్తి చేయడం ద్వారా చిలకలూరిపేటకు మంచినీటి సమస్య అన్నదే లేకుండా చేస్తామని, ఆటోనగర్ నిర్మాణం పూర్తితో స్థానికంగానే వేలాది కుటుంబాలకు ఉపాధిలభిస్తుందన్నారు. కొండవీడు కోట వద్ద సౌకర్యాలు మెరుగుపరుచుకోవడంతో పాటు ఇస్కాన్ ఆలయం కూడా పూర్తయితే ప్రపంచవ్యాప్తంగా వారసత్వ, ఆధ్యాత్మిక గుర్తింపు లభిస్తుందన్నారు. తమ హయాంలో ఎత్తిపోతల పథకాలను సక్రమంగా నిర్వహించడం ద్వారా రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా పంటలు పండించుకున్నారని, మళ్లీ అవే పచ్చటి రోజులు కావాలంటే ప్రజలు తమ చేతుల్లోని ఓటును విజ్ఞతతో ఉపయోగించుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా ఇదేరీతిలో కుంటుబడిపోయిన అభివృద్ధిని ముందుకు తీసుకుని వెళ్లడానికి, పోలవరం, అమరావతి సహా పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయగల సమర్థ నాయత్వాన్ని బలపరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

స్వగ్రామంలో తొలిసారి ఓటు వేయనున్న
రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ డాక్టర్ నిమ్మగడ్డ



రాష్ట్రఎన్నికల మాజీ కమిషనర్ డాక్టర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్

దుగ్గిరాల, మే 12: రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ డాక్టర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ సోమవారం స్వగ్రామంలో ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాలకు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి స్వగ్రామంలో ఓటుహక్కు కోసం కోర్టును ఆశ్రయించారు. తన ప్రాథమిక విద్యనభ్యసిం చడంతోపాటు ఆస్తిపాస్తులన్నీ దుగ్గిరాలలోనే అంటూ ఏడాది పోరా టానంతరం ఆధారాలను కోర్టుకు సమర్పించి, అధికారుల కళ్లు తెరిపించి, ఓటుహక్కు సాధించుకోవడం తెలిసిందే. స్థానిక తహ సీల్దార్ అప్పట్లో స్థానికతపై అభ్యంతరం వ్యక్తం చేసి, ఓటు స్వగ్రామంలో కల్పించేందుకు నిరాకరించిన నేపథ్యంలో కోర్టు ద్వారా సాధించుకుని ఓటుహక్కు కోల్పోయిన వారిలో ధైర్యాన్ని నింపారు. తన బాటలో వారు కూడా ఓటుహక్కు పొందేందుకు స్ఫూర్తిగా నిలిచారు. ఈ నేపథ్యంలో తాను జన్మించిన గ్రామంలో తొలిసారి ఓటువేయనున్నారు.

మా రోజుల్లో ఓటుపై అవగాహన లేదు....

వేమూరు, మే 12: బ్రిటీష్ వారి కాలంలో ఓటు విలువ ప్రజలకు అంతగా తెలిసేది కాదని, ఓటు విలువ తెలిసిన కొద్దీ రాను రాను దాని విలువ కూడా దిగజారుతోందని వేమూరుకు చెందిన శతాధిక వృద్ధ రైతు ముప్వ సుబ్బారావు ఆవేదన వ్యక్తపరిచారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ 1924లో తాను జన్మించానని, 1942లో తొలి ఓటు వేశానన్నారు. ఆ కాలంలో ఇంత విస్తృతంగా ప్రచారం ఉండేది కాదని, ఒక పెద్దమనిషి చెప్పిన మాట ప్రకారం ఓటు వేసేవారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఈ రోజున ఓటును డబ్బుకు అమ్ముకోవడం జరుగుతోందని, పూర్వకాలంలో ప్రతి ఓటరు డబ్బుకు ఆశపడకుండా మాటకు కట్టుబడి ఉండేవారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం మార్పు అవసరమని అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాలకుల మార్పు అవసరమని అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

ఉప్పలపాడులో టీడీపీ ఏజెంట్లపై దాడి

ఇరువురికి తీవ్ర గాయాలు

నరసరావుపేట, మే 12 : పోలింగ్‌కు ముందే నరసరావుపేట మండలం ఉప్పలపాడులో వైసీపీ మూకలు రెచ్చిపోయ్యాయి. అర్థరాత్రి దాడుకు తెగపడ్డాయి. పోలింగ్ బూత్‌లో ఏజెంట్లగా ధరఖాస్తు చేసేందుకు పోలీంగ్ బూత్ వద్దకు వచ్చిన టీడీపీ కార్యకర్తలపై వైసీపీ చెందిన వ్యక్తులు దాడి చేశారు. ధరఖాస్తులను లాగేసుకొని వాటిని చించివేశారు. దాడితో ఇరువురు టీడీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు మహిపతి రామసుబ్బయ్య కాసా ఆంజేయులు, కాసా రాంబాబులను నరసరావుపేటలోని ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. టీడీపీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరామర్శించారు. ఏక పక్షంగా పోలీంగ్ నిర్వహించుకోనేందుకే వైసీపీ పథకం ప్రకారం దాడులకు పాల్పడిందని అయన అరోపించారు. గ్రామంలో పోలీంస్ బందోబస్తు ఏర్పాలు చేసి తమకు చెందిన వారిని ఏజెంట్లగా నియమించాలని డిమాండ్ చేశారు. ప్రశాంత పోలీంగ్ నిర్వహించాలన్నారు.



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న అరవిందబాబు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట


నరసరావుపేట కేంద్రంలో పోలింగ్ మెటీరియల్‌ను పరిశీలించుకుంటున్న ఎన్నికల సిబ్బంది

ఎన్నికలకు విస్తృత ఏర్పాట్లు

- నరసరావుపేట నియోజకవర్గంలో 245 బూత్‌ల ఏర్పాటు
- సమస్యాత్మక గ్రామాలలో సీఆర్‌పీఎఫ్ బలగాలు

నరసరావుపేట, మే 12: నరసరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో పోలింగ్ నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 7గంటల కల్లా పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. నియోజకవర్గంలో 245 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ పోలింగ్ బూత్‌ల వద్ద బందోబస్తుకు సీఆర్‌పీఎఫ్ బలగాలను వినియోగిస్తున్నారు. వీటిలో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తున్నారు. 2,30,572 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 1,12,154, మహిళలు 1,18,389, థర్డ్ జెండర్ ఓట్లు 29 ఉన్నాయి. దివ్యాంగుల కోసం పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. వీల్‌ఛైర్‌లు, ఆటో సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. పోలింగ్ విధులకు నియమించిన సిబ్బందితో పాటు రిజర్వ్‌లో కొంతమంది సిబ్బందిని ఉంచారు. 20శాతం ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్‌లు, వీవీ ప్యాట్‌లను రిజర్వ్‌లో ఉంచారు. ఏ పోలింగ్ బూత్‌లోనైనా ఈవీఎంలు మొరాయిస్తే వాటి స్థానంలో తక్షణమే ఈవీఎంలు ఏర్పాటుచేసేలా వాటిని సిద్ధం చేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద విస్తృత ఏర్పాట్లు చేశారు. విద్యుత్, తాగునీటి సౌకర్యాలను కల్పించారు. పోలింగ్ బూత్‌కు వంద మీటర్ల దూరం వరకు ఎవ్వరినీ అనుమతించకుండా ఓటరు మాత్రమే పోలింగ్ స్టేషన్‌కు వెళ్ళే విధంగా బారికేడ్లు ఏర్పాటుచేశారు. పోలింగ్ స్టేషన్ వద్ద క్యూలైన్‌లకు బారికేడ్లు, షామియానాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని పోలింగ్ బూత్‌లలో వసతులను పురపాలక సంఘం పర్యవేక్షిస్తున్నది. ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఆదివారం పోలింగ్ బూత్‌ల వారీగా మెటీరియల్‌ను పంపిణీ చేశారు. నియోజకవర్గాన్ని 21 సెక్టార్లు, 21 రూట్లుగా విభజించారు. సెక్టార్‌కు కేటాయించిన పోలింగ్ బూత్‌ల వారీగా మెటీరియల్‌ను పంపిణీ చేశారు. సాయంత్రం పోలింగ్ మెటీరియల్‌పై సిబ్బంది ఆర్టీసీ వాహనాల్లో వారికి కేటాయించిన పోలింగ్ బూత్‌లకు ఎస్ఎస్ఎన్ కళాశాలకు తరలివెళ్ళారు. ఉదయం 5:30 గంటలకు ప్రతి పోలింగ్ స్టేషన్‌లో మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. రాత్రి 7గంటల కల్లా నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లకు పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. పోలింగ్ నిర్వహణకు సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి కోరారు. ఉదయం 7 గంటల కల్లా పోలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాట్లు జరిగాయన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్వో పీ సరోజ పాల్గొన్నారు.

చిలకలూరిపేట నియోజకవర్గంలో...

చిలకలూరిపేట, మే 12: చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల విధుల కోసం నియమితులైన సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. నాదెండ్ల మండలం గణపవరంలోని చుండి రంగనాయకులు పాలిటెక్నిక్ కాలేజీలో వీరంతా ఈవీఎంలు, పోలింగ్ సామాగ్రి తీసుకుని ప్రత్యేక బస్సులలో పోలింగ్ కేంద్రాల వద్దకు తరలివచ్చారు. ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సంఘం పరిశీలకుడు శ్రీహరి ప్రతాప్ షాహీ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు వచ్చి ఏర్పాట్లు పరిశీలించారు. ఎన్నికల కోసం సుమారు 2,500 మంది సిబ్బందిని నియమించారు. సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకై 48 బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సాయంత్రం నుంచి సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్‌స్టేషనులకు తరలి వెళ్లారు. పోలింగ్ పూర్తయ్యాక ఈవీఎంలను నరసరావుపేటలోని జేఎన్‌టీయూకు తరలిస్తారు. అక్కడే కౌంటింగ్‌కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ఎన్నికల బరిలో 25 మంది అభ్యర్థులు

చిలకలూరిపేట నియోజకవర్గంలో మొత్తం 2,26,646 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,08,392 కాగా మహిళలు 1,18,205 మంది ఉన్నారు. మహిళ ఓటర్లే సుమారు పదివేల మంది అధికంగా ఉన్నారు. థర్డ్ జెండర్లు 49 మంది ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 241 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోనే 174 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎన్నికలలో మొత్తం 25 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

నియోజకవర్గంలో 89 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

ఎన్నికలను పురస్కరించుకొని పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 89 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అధికారులు గుర్తించారు. వీటిలో పట్టణ పరిధిలో 27, చిలకలూరిపేట మండలంలో 13 ఉన్నాయి. ఇవి కాక నాదెండ్ల మండలంలో 31, యడ్లపాడు మండలంలో 18, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్‌తో పాటు వీడియోగ్రఫీ కూడా ఏర్పాటు చేశారు. చిలకలూరిపేట పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న 132,135,137, 171,172,173,180,181,199,200,201 నంబర్లతో ఉన్న పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవని అర్బన్ పోలీసులు తెలిపారు. ఈ కేంద్రాలలో నాలుగు అంచల భద్రతా వ్యవస్థను అధికారులు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ స్పష్టం చేశారు.

● నాదెండ్ల, మే 12: చిలకలూరిపేట నియోజకవర్గంలో సోమవారం జరుగుతున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నిలకు సంబంధించి పోలింగ్ సామగ్రి, సిబ్బంది ఆదివారం ఆయా కేంద్రాలకు తరలివెళ్ళారు. నాదెండ్ల మండలంలోని గణపవరంలోని చుండి రంగనాయకులు ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని పోలింగ్ సిబ్బందికి అందజేశారు. చిలకలూరిపేట పట్టణంతో పాటు రూరల్ మండలం, నాదెండ్ల, యడ్లపాడు, మండలాల్లోని 241 పోలింగ్ బూత్‌లకు ఈ సామగ్రిని అందజేశారు. కళాశాల ప్రాంగణంలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలకులు శేష్ మనీపాండే పరిశీలించి ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు బారికేడ్లను ఏర్పాటుచేశారు. కాగా ఎన్నికల సామగ్రి పంపిణీని ఆర్వో నారదముని, ఏఈఆర్వోలు సీహెచ్ గోవిందరావు, జ్వాలా నరసింహం, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్ తదితరులు పర్యవేక్షించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు

చిలకలూరిపేట నియోజకవర్గంలోని పలు గ్రామాలతో పాటు పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా పోలీసులు గుర్తించారు. చిలకలూరిపేట మండలంలో కావూరు, కట్టుబడివారిపాలెం, మద్దిరాల, ఎడవల్లి కమ్మవారిపాలెం, పోతవరం, ఈవూరివారిపాలెం, కుక్కపల్లివారిపాలెం గ్రామాలు, యడ్లపాడు మండలంలో గుత్తావారిపాలెం, తిమ్మాపురం, ఉన్నవ, ఉప్పరపాలెం గ్రామాలు, నాదెండ్ల మండలంలో సాతులూరు, కనపర్రు, చందవరం, గొరిజవోలు, జంగాలపల్లి, ఇర్లపాడు, అమీన్‌సాహెబ్‌పాలెం, ఎండుగుంపాలెం గ్రామాలతో పాటు కొన్ని పోలింగ్ బూత్‌లు సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్టు రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అదేవిధంగా చిలకలూరిపేట పట్టణ పరిధిలోని వడ్డెర కాలనీ, పురుషోత్తమపట్నం, సుగాలీ కాలనీ, మద్దినగర్ ప్రాంతాలు సమస్యాత్మకమని పోలీసులు తెలిపారు.

వినుకొండ నియోజకవర్గంలో...

వినుకొండ టౌన్, మే 12: నియోజకవర్గంలో మొత్తం 2,64,559 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 299 పోలింగ్ బూత్‌ల ద్వారా ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఒకొక్క పోలింగ్ బూత్‌కి ఆరుగురు చొప్పును సుమారు 2వేల మంది సిబ్బందిని సిద్ధంచేసి ఇప్పటికే విధులు కేటాయించారు. ఆదివారం పట్టణంలోని నిర్మ లా పాఠశాల నుంచి 27రూట్లలో ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల ద్వారా ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది పోలింగ్ బూత్‌లకు తరలించారు. సమస్యాత్మక ప్రాంతాల్లోని పోలింగ్‌బూత్‌లను గుర్తించి 50కిపైగా సీసీ కెమెరాలను అమర్చారు.

డ్యూటీల్లో అసంతృప్తి...

నిర్మలా పాఠశాల్లో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్ద కొన్ని పోలింగ్ బూత్‌లకు పీవోలు లేకుండా కిందిస్థాయి సిబ్బందికి రూట్లు కేటాయించిన బస్సుల ద్వారా తరలించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. రిజర్వులో ఉన్న పీవోలకు డ్యూటీలు కేటాయించకపోవడంతో.. పీవోల నియామకం కలెక్టర్ ఆదేశాల మేరకు ఉండటంతో రిజర్వులో ఉన్న పీవోలకు ఆదేశాలు అందడంలో జాప్యం జరిగిందని, కలెక్టర్ ఆదేశాల మేరకు వారిని మీ వద్దకు చేరుస్తామని పదేపదే ఎన్నికల విధుల్లో పాల్గొన్న కొందరు సిబ్బంది చెప్పడంతో వారు శాంతించి ఎట్టకేలకు వారు డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఈవీఎంలతో వెళ్లారు.

వయస్సు మళ్లిన వారికి ఎన్నికల విధులు..

నేడు జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులకు ఎన్నికల విధులు కేటాయించారు. కొందరు అనారోగ్యంతో బాధపడుతూ విధుల నుంచి తప్పించాలని ప్రాధేయపడిన అధికారులు మాత్రం ససేమిరా అన్నారు. ఈ నేపథ్యంలో చిలకలూరిపేటలో శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న బండి నిర్మలకు ఎన్నికల విధులు కేటాయించారు. ఆమె కొంతకాలంగా కిడ్నీ, లోబీపీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంది. డ్యూటీ నుంచి మినహాయింపు ఇవ్వాలని అధికారులకు మొరపెట్టుకుంది. అధికారులు మాత్రం ససేమిరా అన్నారు. ఎట్టకేలకు విధుల్లో పాల్గొనేందుకు డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్దకు వచ్చిన నిర్మల ఒక్కసారిగా బీపీ డౌన్ కావడంతో కుప్పకూలింది. గమనించిన తోటి సిబ్బంది ఆర్వో సుబ్బారావు దృష్టికి తీసుకువచ్చారు. బూత్ నెం.94 అగ్నిగుండాల్లోని డ్యూటీకి కేటాయించారని, ఆమెను విధుల నుంచి మినహాయించి కొత్తవారిని ఇవ్వాలని స్థానిక అధికారులు కోరారు.

రొంపిచర్ల మండలంలో పోలింగ్ ఏర్పాట్లు పూర్తి

రొంపిచర్ల, మే 12: మండలంలోని గ్రామాల్లో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 64 పోలింగ్ కేంద్రాల్లో బారికేడ్లు, టెంట్ సౌకర్యాలను కల్పించారు. 64 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 53,552 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 26,332 మంది పురుషులు, 27,218 మంది మహిళలు, ఇతరులు ఇద్దరు ఉన్నారు. ఇద్దరు డీఎస్పీలు, ఒక అడిషనల్ ఎస్పీ, ఒక సీఐ, నలుగురు ఎస్ఐలు, సుమారు రెండు వందల మంది బీఎస్ఎఫ్, పోలీసు సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. సమస్యాత్మక గ్రామాలైన రొంపిచర్ల, కొనకంచివారిపాలెం, గోగులపాడు, అలవాల, తురుమెళ్ళ, సుబ్బయ్యపాలెం గ్రామాల్లో అదనపు బలగాలను ఏర్పాటుచేస్తున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలను సీసీ కెమేరాలను ఏర్పాటుచేశారు.

యడ్లపాడు మండలంలో...

యడ్లపాడు, మే 12: మండలం పరిధిలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలోని 44,381 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో మహిళా ఓటర్లు 22,988మంది ఉండగా, పురుష ఓటర్లు 21,393మంది ఉన్నారు. వీరికోసం 57 పోలింగ్ బూత్‌లను అధికారులు ఏర్పాటుచేశారు. ఎన్నికల నిర్వహణకోసం ఆరుగురు సెక్టోరల్ అధికారులు, 11మంది రూట్ ఆఫీసర్లతోపాటు 342మంది సిబ్బందిని నియమించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ఎన్నికల నిర్వహణకోసం పీవో, ఏపీవోలతో పాటు మరో నలుగురు ఓపీవోలు విధులు నిర్వహించనున్నారు. అంతేగాకుండా పోలింగ్ కేంద్రాలవద్ద బందోబస్తు కోసం డీఎస్పీ, సీఐ, ఇద్దరు ఎస్ఐలతో పాటు 70 మంది పోలీసులను నియమించారు.

● మండలంలోని 57 పోలింగ్ బూత్‌లలో ఎన్నికల విధులకోసం 342 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. అదనంగా మరో 10 మంది సిబ్బందిని రిజర్వులో ఉంచారు. వీరంతా బుధవారం సాయంత్రం 5.30 గంటలకు ప్రత్యేక బస్సులలో గణపవరం సీఆర్ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఈవీఎంలు, వీవీ పాడ్‌లతోపాటు ఎన్నికల సామగ్రితో ప్రత్యేక బస్సులలో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.


చిలకలూరిపేటలో, యడ్లపాడు, వినుకొండ నుంచి పోలింగ్ సామగ్రితో కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది

ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

● నరసరావుపేటలో ఫ్లాగ్ మార్చ్‌లో కలెక్టర్, ఎస్పీ

నరసరావుపేట, మే 12: జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ శివ శంకర్ లోతేటి, ఎస్పీ బిందు మాధవ్ కోరారు. నరసరావుపేట పట్టణంలోని పల్నాడు బస్టాండ్ నుంచి మల్లమ్మ సెంటర్ వరకు పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ కలిసి ఎస్పీ బిందు మాధవ్ కేంద్ర భద్రతా బలగాలు, స్థానిక పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలకు పోలీసు వారు అందుబాటులో ఉన్నారని, అందరూ ధైర్యంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని వారు సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి అవసరమైన అన్ని బందోబస్తు ఏర్పాట్లు చేశాం. అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మక గ్రామాల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకోవడమే తమ ప్రధాన లక్ష్యం అన్నారు. అందుకోసం ప్రజలలో ధైర్యం నింపడానికి ఇప్పటికే కేంద్ర భద్రతా బలగాలతో ఫ్లాగ్ మార్చ్, మార్చి ఫస్ట్ నిర్వహించడం జరిగింది. ఇప్పటికే జిల్లాలో ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో సమస్యలు సృష్టిస్తారని అనుమానం కలిగిన సుమారు 11వేల మందిని బైండోవర్ చేయడం జరిగింది. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై వెంటనే చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక పోలీస్ బృందాలను నియమించడం జరిగిందన్నారు.

ప్రజలకు సూచనలు

పోలింగ్ సందర్భంగా ఎస్పీ బిందుమాధవ్ ప్రజలకు పలు సూచనలు చేశారు. ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం పోలింగ్ కేంద్రాల వద్ద నుంచి దూరంగా వెళ్ళాలి. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో ఉండాలి, పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులు గుంపులుగా ఉండకూడదు, అల్లర్లు, గొడవలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ వద్దని, ఎక్కడైనా ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే దగ్గరలోని పోలీసు వారికి తెలియచేయాలని, నిష్పక్షపాతమైన, పారదర్శకమైన ఎన్నికల కొరకు ప్రజలు పోలీసు వారికి సహకరించాలని సూచించారు.

ఓటు హక్కు వినియోగం కోసం తరలి వచ్చిన యువకులు

రొంపిచర్ల, మే 12: మండలంలోని గ్రామాలకు చెందిన ఉద్యోగులు, చదువుకునే వారు హైదరాబాద్, బెంగుళూరు, మద్రాసు, పలువురు విదేశాల్లోనూ నివశిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకొనేందుకు స్వగ్రామాలకు ఆదివారం వారంతా తరలివచ్చారు. ఓటు విలువను తెలుసుకొని ఓటు వేయటానికి వచ్చామని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిని కోరుకొనే వారికి ఓటు వేస్తామన్నారు. వీరిలో కొంత మంది తొలిసారి ఓటు హక్కును వినియోగించుకుంటుంటే మరికొంతమంది రెండోసారి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.


టీడీపీలో చేరిన న్యాయవాది హైమానందరావు

టీడీపీలో చేరిన న్యాయవాదులు

నరసరావుపేట లీగల్, మే 12: గత కొంతకాలంగా వైసీపీ లీగల్ సెల్‌కు చెందిన పలువురు న్యాయవాదులు టీడీపీ బాటపట్టారు. గతంలో సీనియర్ న్యాయవాదులు, వైసీపీ లీగల్ సెల్ సభ్యులు మోరా ప్రతాపరెడ్డి, దేసిరెడ్డి చిన్నపరెడ్డి, కాశిమళ్ళ విజయ కుమార్ తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కాగా ఆదివారం సీనియర్ న్యాయవాది మండలంలోని రావిపాడుకు చెందిన కామన హైమానందరావు నరసరావుపేట టీడీపీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ అరవిందబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనకు పార్టీ కండువాకప్పి అరవిందబాబు సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మల్లవరపు ప్రాన్సిస్, హృదయరాజు, శౌరిరాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.